

భీమవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 27.0



భీమవరంలో బస్సు ఎక్కుతున్న మహిళలు

బస్సు ఎక్కుదాం !

ఉచిత ప్రయాణానికే మహిళల మొగ్గు
మూడు రోజులుగా పెరుగుతున్న రద్దీ
వారం రోజుల్లో 3,89,341 మంది ప్రయాణం

భీమవరం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణానికి మహిళల సంఖ్య పెరుగుతోంది. పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం డిపోల పరిధిలో ఈనెల 15వ తేదీన ఈ పథకం ప్రారంభమైంది. 21వ తేదీ వరకు మూడు లక్షల 89 వేల 341 మంది మహిళలు ఉచితంగా తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. మొదటి మూడు రోజుల్లో 1,05,816 మంది ప్రయాణించగా, తర్వాత నాలుగు రోజులకు ఈ సంఖ్య 2 లక్షల 83 వేల 525 కు చేరింది. ఈ లెక్కన చూస్తే ఉచిత బస్సు ప్రయాణంపై మహిళల్లో ఆసక్తి పెరుగుతోంది. పవిత్ర పుణ్య దినాల్లో పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు ఎక్కువ మంది మక్కువ చూపుతున్నారు. బస్సుల్లో 90 శాతం మంది మహిళలు ప్రయాణిస్తుంటే.. పదిశాతం మంది మాత్రమే పురుషులు వుంటున్నారు. టిక్కెట్లు కొనేది కూడా వీరే కావడంతో ఆర్టీసీకి టిక్కెట్‌ల రూపేణా ఆదాయం గణనీయంగా తగ్గుతోంది. గతంలో త్వరగా ప్రయాణించేందుకు బస్సుల కోసం ఎదురు చూసేవారు కాదు. ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి వెళ్లేవారు. కానీ ఇప్పుడు 90 శాతం మంది ఉచిత బస్సు ప్రయాణానికే మొగ్గు చూపుతున్నారు. మరోవైపు చాలా మహిళలు ఆధార్ కార్డులు తెచ్చుకోకపోవడం, తెచ్చిన వాటిల్లో ఫొటోలు సరిగా లేకపోవడంతో ఫ్రీ టిక్కెట్ ఇచ్చేందుకు కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ విషయంలో కొంత స్పష్టత ఇవ్వాలని అధికారులను కోరుతున్నారు.

15 నుంచి 21వ తేదీ వరకు ప్రయాణ వివరాలు

	ఇతరులు	ఆదాయం	మహిళలు	లబ్ధి
15వతేది	71,119	36,19,597	3126	90,565
16వతేది	47,266	26,47,596	44310	15,50,360
17వతేది	46,657	26,29,520	58,380	19,96,585
18వతేది	49,269	32,42,459	69,256	22,62,940
19వతేది	39,802	24,77,702	59,635	21,63,590
20వతేది	40,398	23,50,735	76,534	23,31,155
21వతేది	38,155	21,71,079	78,100	23,39,205
	3,32,666	1,91,38,688	3,89,341	1,27,34,400



వరలక్ష్మీ..నమోస్తుతే !

శ్రావణమాసం ఆఖరి శుక్రవారం ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి పూజలు నిర్వహించారు. భీమవరంలో మావుళ్ళమ్మ ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా మహాలక్ష్మి అలంకారం చేశారు. వందలాదిమంది మహిళలు సామూహిక వ్రతంలో పాల్గొన్నారు. గునుపూడి ఆదిలక్ష్మీ రాజ్యలక్ష్మీ, పోలేరమ్మ అమ్మవార్ల ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో 800 మంది మహిళలు పాల్గొన్నారు. జిల్లాలోని ప్రసిద్ధ అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి



మావుళ్లమ్మ ఆలయంలో సామూహిక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెన్షన్ కిరి..కిరి

మంచాన పడకపోయినా రూ.15 వేలు



దివ్యాంగులకు ఆర్థికంగా చేయూత అందించాలనే లక్ష్యాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అర్హులు కాకపోయినా పింఛన్లు రాయించుకున్నారు.. ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రభుత్వం వెరిఫికేషన్ చేపట్టింది. ఈ తనిఖీల్లో చాలామంది అనర్హులుగా తేలారు. తణుకు మండలంలోని రెండు మేజర్ గ్రామాల్లో రూ.15 వేలు పింఛన్‌లు పొందుతున్న వారిలో కొందరు పెట్రోలు బంకులో పనిచేసుకుంటున్న వారు ఉండగా రెండు చక్రాలు వాహనం నడిపే వారు బెడ్ రిడెన్ పింఛన్‌లు పొందుతున్నారు. జిల్లాలో 944 మందిని రూ.15 వేలు పెన్షన్లకు అనర్హులుగా గుర్తించారు..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో నిర్వాకం
అప్పట్లో రూ.10 వేలు..
ఒత్తిడి తెచ్చి పెన్షన్లు రాయించుకున్నారు
అనర్హులపై ఫిర్యాదుల వెల్లువ
వైద్యుల బృందం సర్వే
జిల్లాలో 1,510 మందికి 944 మంది అనర్హులు
వారంతా ఇతర పెన్షన్‌లకు మళ్లింపు



వైసీపీ హయాంలో అనర్హులకు పింఛన్లు ఇచ్చేశారు. మంచానపడి నడవలేని పరిస్థితులో ఉన్నారంటూ పెన్షన్‌లను ఖరారు చేశారు. అప్పట్లో నెలకు రూ. 10 వేలు పెన్షన్ ఇచ్చారు. ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుని అధికారులపై ఒత్తిడి తెచ్చి ఇలా పెన్షన్లు రాయించేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంచం నుంచి కదలలేని బాధితులకు ప్రతినెలా రూ. 15 వేలు పెన్షన్ ఇస్తోంది. నడవ గలుగుతున్నవారు కూడా నెలకు రూ. 15 వేలు తీసుకుంటున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. దాంతో ప్రభుత్వం వైద్యులతో కూడిన బృందాలను నియమించింది. ఇంటింటికి వెళ్లి పెన్షన్ లబ్ధిదారులను పరిశీలించాలని ఆదేశించింది. కొద్ది నెలల క్రితం సర్వే పూర్తయింది. వైద్యుల బృందం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. బెడ్ రిడెన్ పెన్షన్‌కు అనర్హుల జాబితా అందజేసింది. తదనుగుణంగా జిల్లాలో గ్రామీణ అభివృద్ధి శాఖ బెడ్ రిడెన్ పెన్షన్ దారులకు నోటీసులు జారీచేస్తోంది. జిల్లాలో బెడ్‌రిడెన్ కింద 1,510 మంది లబ్ధిదారులు నెలకు రూ.15 వేలు తీసుకుంటున్నారు. అందులో 603 మందికి నడిచేశక్తి ఉన్నట్టు వైద్య బృందం గుర్తించింది, వారంతా వయసు మీరిన వారే. వృద్ధాప్య పెన్షన్‌లకు అర్హులు. దీంతో వారందరికీ వచ్చే నెల నుంచి రూ. 4 వేలు పెన్షన్ ఇస్తున్నట్టుగా నోటీసులు జారీ చేసింది. మరో 341 మంది దివ్యాంగులు కూడా బెడ్‌రిడెన్ పెన్షన్‌కు అనర్హులుగా తేల్చారు. వారంతా నడవగలిగే స్థితిలో ఉన్నారు. మంచానికి పరిమితం కాలేదు. వారికి దివ్యాంగ పెన్షన్ నెలకు రూ.6 వేలు పంపిణీ చేస్తారు. ఇలా జిల్లాలో 1,510 లబ్ధిదారుల్లో 944 మంది బెడ్‌రిడెన్ పెన్షన్‌కు అనర్హుల య్యారు. వారికి ఇతర పెన్షన్‌లు మంజూరు కానున్నాయి. కేవలం 566 మంది మాత్రమే మంచానికి పరిమిత మయ్యారని వైద్యుల బృందం నిర్ధారించింది. వారికి ఎప్పటిలాగే రూ. 15 వేలు పెన్షన్ మంజూరు కానుంది.

అనర్హుల జాబితాలో దివ్యాంగులు

జిల్లాలో సుమారు 27,460 మంది లబ్ధిదారులు దివ్యాంగ పెన్షన్ పొందుతున్నారు. ప్రభుత్వం వారికి కూడా సర్వే నిర్వహించింది. ఇప్పటిదాకా 15 వేల మందిని పరిశీలించారు. అందులో 1906 మంది దివ్యాంగ పెన్షన్‌కు అనర్హులుగా గుర్తించారు. నోటీసులు జారీ చేస్తున్నారు. అర్హత ఉన్నట్టు భావిస్తే మరోసారి సదరం ధృవీకరణ పత్రాన్ని సమర్పించడానికి ప్రభుత్వం నెలరోజుల వ్యవధి ఇచ్చింది. అప్పటిలోగా సదరం ధృవీకరణ పత్రాన్ని మంజూరు చేయకపోతే ఇక పెన్షన్ అవకాశం ఉండదు. దివ్యాంగ పెన్షన్ పొందాలంటే 40 శాతం వైకల్యం ఉన్నట్టు వైద్యులు నిర్ధారించాలి. అప్పుడే ప్రతినెలా రూ. 6 వేలు వంతున దివ్యాంగ పెన్షన్ మంజూరు కానుంది. జిల్లాలో మరో 12,460 మంది దివ్యాంగులకు సర్వే పూర్తి చేయాల్సి ఉంది. అందులోనూ అనర్హులున్నట్టు గుర్తిస్తే నోటీసులు జారీ చేస్తారు. సదరం ధృవీకరణకు అవకాశం కల్పిస్తారు.

కొత్త వారికి ఛాన్స్

ప్రస్తుతం అనర్హులుగా తేలిన లబ్ధిదారుల స్థానంలో కొత్తవారికి పెన్షన్ మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిజమైన అర్హులకు బెడ్ రిడెన్, దివ్యాంగ పెన్షన్‌లు మంజూరు కానున్నాయని అధికారులు భావిస్తున్నారు. ఆ దిశగానూ ప్రభుత్వం నుంచి సంకేతాలు అందాయి. మొత్తంపైన అనర్హులను ఏరి వేసి వారి స్థానంలో అర్హులకు పెన్షన్ మంజూరయ్యేలా అధికార యంత్రాంగం ముమ్మర కసరత్తు చేస్తోంది.

రూ.2 కోట్లతో డయాలసిస్ సెంటర్

తాడేపల్లిగూడెం ఆసుపత్రిలో ఏర్పాటు
అత్యాధునిక వసతులతో సేవలు
జిల్లాలోని రోగులకు ఊరట

తాడేపల్లిగూడెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలలోని కిడ్నీ వ్యాధితో బాధపడే రోగులకు కాస్తంత ఊరట లభించనున్నది. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో రూ.2 కోట్లతో అత్యాధునిక వసతులతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. దీనికోసం ఆసుపతిర ఎంట్రన్స్ గేట్ ఆనుకుని ఉన్న ఐడీ (ఇన్‌ఫెక్టన్ డిసీజస్) సెంటర్ భవనాన్ని పూర్తిగా ఖాళీ చేయిస్తున్నారు. ఇప్పటికే ఆ భవనంలో ఉన్న కిటికీలు, గుమ్మాలనూ పూర్తిగా తొలగించారు. ఇక గోడలను, భవనం పైకప్పును తొలగించాల్సి ఉంది. కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గతంలో డయాలసిస్ సెంటర్ పరిస్థితిని వివరించారు. రోగుల పరిస్థితులను కూడా ఎంపీకి వివరించారు. దీనిపై స్పందించిన భూపతిరాజు శ్రీనివాసవర్మ తక్షణమే రూ.2 కోట్లు మంజూరు చేశారు. డయాలసిస్ సెంటర్ నూతన భవనంలో ఏర్పాటు చేయాలని తలచారు. దీనికోసం స్థలాన్ని వెతికారు. ప్రస్తుతం డయాలసిస్ సెంటర్‌కు అత్యంత చేరువులోనే ఐడీ భవనం ఉంది. దీన్ని తొలగించి కొత్త భవనాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.



డయాలసిస్ సెంటర్ భవనం నిర్మించేది ఇక్కడే..

జిల్లాలో గుర్తింపు పొందిన సెంటర్

ఈ డయాలసిస్ సెంటర్‌కు ప్రత్యేకత ఉంది. 2016 సెప్టెంబర్ 23న అప్పటి తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు దీన్ని ఏర్పాటు చేయించారు. అప్పుడు కేవలం 10 బెడ్స్‌తో దీని ఏర్పాటు చేశారు. ఇప్పుడు దీన్ని విస్తరించి 23 బెడ్స్‌కు పెంచారు. ఈ డయాలసిస్ సెంటర్ పరిధిలోకి 150 రోగులు నమోదు చేయించుకున్నారు. వీరికి నాలుగు షిఫ్టులుగా రోజుకు 55 నుంచి 60 మందికి డయాలసిస్ జరుగుతుంది. ఒక్కో షిఫ్ట్‌కు 21 మంది చొప్పున డయాలసిస్ ఇస్తున్నారు. ఒక్కో రోగికి డయాలసిస్ జరగా లంటే 4 గంటల సమయం పడుతుంది. జిల్లా నలుమూలల నుంచి నిత్యం రోగులు వస్తుంటారు.

50 పడకలకు విస్తరణ

కొత్తగా ఏర్పాటు చేసే డయాలసిస్ సెంటర్‌లో 50 పడకలను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఎక్కడా రాజీపడని విధంగా భవన నిర్మాణం, రోగులకు వసతులను కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు. రోజుకు 100 నుంచి 150 మందికి డయాలసిస్ జరిగేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే ఏరియా ఆసుపత్రిలో సేవలను మెరుగుపరిచారు. దీనికోసం ప్రత్యేక భవన సముదాయాలు నిర్మాణం జరుగుతుంది.

• ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ రోగులకు వరం



కొత్తగా ఏర్పాటు చేసే డయాలసిస్ సెంటర్ వల్ల ఎంతో మంది రోగులకు మేలు జరుగుంది. ఇప్పటికే తాడేపల్లిగూడెం డయాలసిస్ సెంటర్‌కు మంచి గుర్తింపు వచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసే డయాలసిస్ సెంటర్ పరిధి పెరిగి మరింత మంది రోగులకు సేవలు అందించవచ్చు.
-డాక్టర్ రవిపాల్, ఆసుపత్రి సూపరింటెండెంట్

• 200 మందికి సేవలు అందించాలని లక్ష్యం



కొత్తగా ఏర్పాటు చేసే డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో 200 మంది రోగులకు మెరుగైన సేవలు అందిస్తాం. పనులు వేగవంతంగా చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా డయాలసిస్ రోగులకు సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కృషి ఎంతో ఉంది.
-ఐడుగు వెంకటేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు



25న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్
ఉమ్మడి జిల్లాలో 1074 పోస్టులు .. 5లోగా నియామకాల పూర్తి
7

గణేశ్‌లు ముస్తాబు
నిబంధనలు పాటించాల్సిందే..
6



ఉగ్ర గోదావరి

తీర గ్రామాలను తాకిన వరద
వశిష్ఠ వరద పోటుకు స్లూయిస్‌ల లీకేజీ
ఇసుక బస్తాలతో అడ్డు కట్ట

వేలేరుపాడు /కుక్కునూరు/ పోలవరం, ఆచంట /యలమంచిలి/ నరసాపురం ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో గోదావరి వరద తగ్గుముఖం పట్టినప్పటికీ దిగువన ఉధృతంగానే ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద క్రమేపీ తగ్గుతున్నా ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరులో గ్రామాలను వరద వీడడం లేదు. వేలేరుపాడు మండలంలో 23 గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోగా అత్యవసర పనులు నిమిత్తం ఆయా గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. పోలవరం వద్ద గోదావరిలో నీటిమట్టం అనూహ్యరీతిలో పెరిగింది. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు ఆక్రమిం చాయి. కడెమ్మ స్లూయిజ్ గేట్లు పూర్తిగా నీటమునిగాయి. ఎగువ నుంచి వరదనీరు వస్తుండడంతో శుక్రవారం గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఆచంట మండలం అయోధ్యలంక, పెదమల్లం లంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాలోకి వరదనీరు చేరింది. పెదమల్లం మాచేనమ్మ ఆలయం చుట్టూ చేరింది. పడవల రాకపోకలు నిషేధించారు. వరద పరిస్థితిని రెవెన్యూ అధికారులు సమీక్షిస్తున్నారు. నరసాపురం ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ కనకరాజు కోడేరు నుంచి పడవపై పెదమల్లం లంక గ్రామాలకు వెళ్లి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



పెదమల్లం మాచేనమ్మ ఆలయం వద్దకు చేరిన వరద నీరు



కనకాయలంక కాజ్ వే వద్ద పడవల్లో ప్రయాణం



నరసాపురంలో స్లూయిస్‌ల వద్ద ఇసుక బస్తాలు వేస్తున్న సిబ్బంది

కాజ్ వే వద్ద పడవల్లోనే ప్రయాణం

నాలుగు రోజులుగా కనకాయలంక కాజ్‌వే వరద ముంపులోనే ఉంది. లంకవాసులు ఇతర గ్రామాలకు వెళ్లేందుకు పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. పెదలంక గ్రామంలో పల్లపు ప్రాంతాల్లో ఉన్న సుమారు 20 ఇళ్ల చుట్టూ వరదనీరు చేరింది. కంచుస్థంభంపాలెం, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలిలంక, యలమంచిలి, చించినాడ, బాడవ గ్రామాల్లో లంకభూముల్లోని పల్లపుప్రాంతాల్లోకి వరదనీరు చేరుతోంది. ఎగువప్రాంతాల్లో వరద తగ్గుతుండటంతో ఆదివారం నాటికి వరద తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. కనకాయలంక, పెదలంక గ్రామాల్లో వరద పరిస్థితిని తహసీల్దారు జి.పవన్‌కుమార్ పరిశీలించారు.

నరసాపురం రేవు గట్లపైకి నీరు

వశిష్ఠ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. నరసాపురం వద్ద పిండాలరేవు, బాపు ఘట్, వలంధర్‌రేవు గట్టుపైకి నీళ్లు చేరాయి. వరద ప్రవాహానికి స్లూయిస్‌ల నుంచి నీరు లీకేజీ మొదలైంది. దీంతో ఏటిగట్టుశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పొన్నపల్లి, మాధవాయిపాలెం, ముస్కేపాలెం, ఏటిగట్టుల వద్దనున్న స్లూయిస్‌లను మూసివేశారు. లీకేజీలు ఉన్న చోట్ల ఇసుక బస్తాలు వేస్తున్నారు. ఇప్పటికే ఇసుక ర్యాంపు వద్ద దాదాపు 5 వేల ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచారు. ఏఈ పవన్ ఆధ్వర్యంలో సిబ్బంది 24 గంటలు గట్టు గస్తీ కాస్తున్నారు. బలహీనంగా ఉన్న చోట్ల ఇసుక బస్తాలతో పటిష్ఠం చేస్తున్నారు. రెండో రోజు శుక్రవారం కూడా గోదావరిలో రాకపోకలు నిలిచిపోవడంతో స్టీమర్‌రోడ్, మాధవాయిపాలెం రహదార్లు వెలవెలబోయాయి.







వినాయక చవితి ఉత్సవాలకు

ముస్తాబైన గణేశ్



ఏలూరు కార్పొరేషన్/పాలకొల్లు అర్బన్/తణుకు రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు గణనాథుడు ముస్తాబయ్యాడు. ఉమ్మడి జిల్లాలో పలు పట్టణాల్లో రాజస్థాన్ కళాకారులు పీవో పీ, తాటిపీచు, కొబ్బరిపీచుతో వివిధ ఆకృతులు, రంగుల్లో గణనాథుల విగ్రహాలను తయారుచేశారు. అడుగు ఎత్తు నుంచి 20 అడుగుల విగ్రహాలను గణేశ్ ఉత్సవ నిర్వాహకులు కొనుగోలు చేస్తున్నారు. విగ్రహాల ఎత్తును బట్టి రూ.5 వేల నుంచి రూ.70 వేల ధర పలుకుతోంది. రాజస్థాన్ కళాకారులతో పాటు స్థానిక కళాకారులు కూడా గణేశ్ విగ్రహాలు తయారు చేస్తున్నారు. పీవోపీ మాత్రమే కాకుండా మట్టి విగ్రహాలు సిద్ధం చేస్తున్నారు. పాలకొల్లు సమీపంలోని వర్ధనం గ్రామానికి చెందిన ఇంటి ప్రసాద్ లయన్స్ నగర్ ప్రాంతంలో మరో 10 మందితో విగ్రహాలు చేస్తున్నారు. 3 నెలలుగా కొన్ని విగ్రహాలను తయారుచేసి ఉత్సవాలకు సిద్ధం చేశామన్నారు. సుమారు రూ.3లక్షల పెట్టుబడితో 200 గణనాథుల విగ్రహాలను తయారు చేశానని తెలిపారు. మట్టి విగ్రహాలు కూడా కోరితే తయారుచేస్తామని తెలిపారు. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన రేలంగి సత్యనారాయణ దేవుళ్ల విగ్రహాలతో పాటు జాతీయ నాయకుల విగ్రహాల తయారు చేస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాలకు పలు సేవా సంస్థలు ఎకో గణపతి పేరుతో మట్టి విగ్రహాలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు.







నిబంధనలు పాటించాల్సిందే..

భీమవరం క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆహ్లాదకర వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు కృషి చేయాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పిలుపునిచ్చారు. మండపాల నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలు, భద్రతా అంశాలపై ఎస్పీ సూచనలు చేశారు.

ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

వినాయక ఉత్సవ కమిటీలు మండపాల ఏర్పాటు, ఉత్సవాలకు అనుమతి తీసుకోవడం తప్పనిసరి. గణేశ్ ఉత్సవ.నెట్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వెబ్‌సైట్‌లో ఫోన్ నంబర్, ఓటీపీ ద్వారా లాగిన్ అయ్యాక, అవసరమైన వివరాలను నింపాలి. దరఖాస్తును పరిశీలించిన తర్వాత పోలీసులు ఒక క్యూఆర్ కోడ్‌ను జారీ చేస్తారు. క్యూఆర్ కోడ్‌ను మండపం వద్ద తప్పకుండా అతికించాలి.

విద్యుత్ జాగ్రత్తలు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ వైరింగ్‌ను నిపుణులతో చేయించాలి.

సౌండ్ సిస్టమ్: లౌడ్ స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలి. ఆసుపత్రులు, విద్యా సంస్థలు, మతపరమైన ప్రదేశాల వద్ద మైకులు వాడకూడదు.

నిఘా: మండపాలలో రాత్రిపూట కమిటీ సభ్యులు కాపలా ఉండాలి. మండపాలలో విలువైన వస్తువులను ఉంచకూడదు. శాంతి భద్రతల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

రోడ్డు భద్రత: విగ్రహాలను, మండపాలను రోడ్లపై ఏర్పాటు చేయరాదు. బ్యానర్లు, ఫ్లెక్సీలు ప్రజలకు, ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు కలిగించకూడదు.

ఊరేగింపు, నిమజ్జనం నిబంధనలు

నినాదాలు, ప్రదర్శనలు: ఊరేగింపు సమయంలో కులలాలు, మతాలు లేదా పార్టీలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే నినాదాలు, అనుచిత ప్రదర్శనలు, అసభ్యకరమైన నృత్యాలు చేయకూడదు. డీజే, బాణసంచాకు అనుమతి లేదు.

వాహనాల నియమాలు: నిమజ్జనం వాహనాలకు లైసెన్స్ ఉన్న డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలి. మద్యం సేవించిన వారు లేదా మైనర్లు వాహనంపై ఉండకూడదు.

నిమజ్జన సమాచారం: నిమజ్జనం మార్గం, సమయం, తేదీ వివరాలను పోలీసులకు తప్పనిసరిగా తెలియజేయాలి. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా కమిటీ సభ్యులు తగినంత మంది వాలంటీర్లను ఏర్పాటు చేయాలి.

భద్రతా ఏర్పాట్లు: నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి.

అవాంఛనీయ సంఘటన జరిగినా, జరగడానికి అవకాశం ఉన్నా వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలి. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటారు.


సత్రంపాడు అంబికా ఆలయంలో వ్రతమాచరిస్తున్న మహిళలు

వరాలివ్వు తల్లీ..

ద్వారకాతిరుమలలో సామూహిక వరలక్ష్మీ వ్రతం



ద్వారకాతిరుమలలో అమ్మవారి ఊరేగింపు, పత్తేబాదలో గాజుల అలంకరణ

ద్వారకాతిరుమల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వరలక్ష్మీ.. వరాలీయమ్మా అంటూ వ్రత దీక్షలో మహిళలు వేడుకున్నారు. చిన్న వెంకన్న ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను మహిళలు నిర్వహించారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని అనివేటి మండపంలో దాదాపు 3వేల మంది మహిళలు పూజల్లో పాల్గొన్నారు. ముందుగా వెండి తొళక్క వాహనంపై వరలక్ష్మీ అమ్మవారిని అర్చకులు, పండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ అనివేటి మండప వేదిక వద్దకు తెచ్చారు. అలంకరించిన వేదికపై అమ్మవారిని ఉంచి అర్చకులు హారతులు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. వ్రతదీక్ష అనంతరం మహిళలకు అమ్మవారి ప్రసాదంగా పసుపు, కుంకుమ, జాకెట్టు ముక్క, గాజులను పంపిణీ చేశారు. ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళలతో కిటకిటలాడిన ఆలయాలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అమ్మవారి ఆలయాల వద్ద మహిళలు విశేష పూజలు, సామూహిక వరలక్ష్మీవ్రతాలు చేశారు. ప్రత్యేక అలంకారంలో అమ్మవార్లు దర్శనమిచ్చారు. కుంకుమార్చనలు, సామూహిక పారాయణతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. సత్రంపాడు సౌభాగ్యలక్ష్మీదేవిని కొల్హాపూర్ మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. పట్టు చీరలతో అంబికాదేవి అమ్మవారిని అలంకరించారు. పత్తేబాదలోని కనకదుర్గమ్మకు లక్ష పంచ రంగుల గాజులు, బావిశెట్టివారి పేట కనకదుర్గాంబ గాజుల గౌరీదేవిగా అలంకరించారు. ఆలయాల మహిళలు సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు నోచుకున్నారు.



ఏలూరులో ప్రత్యేక అలంకరణలో సౌభాగ్యలక్ష్మి, అంబికా దేవి



వెరీ గుడ్డు


ధర పెరగడంతో రైతుకు ఊరట

తణుకు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గుడ్డు ధర పెరగడంతో పౌల్ట్రీ రైతులకు ఊరట కలిగింది. బర్డ్‌ఫ్లూ ప్రభావం తర్వాత గుడ్డ ధర పతనం కాగా ఇటీవల నెమ్మదిగా ధర పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం గుడ్డు ధర రూ.4.95 ఉంది. పది రోజుల క్రితం రూ.4.15 ధర ఉండగా ప్రసుతం రూ4.95 ధరకు చేరింది.

వరుస నష్టాలతో డీలా పడిన పౌల్ట్రీ రైతులకు కాస్త ఉపశమనం కలిగినట్లయింది. వేసవిలో రైతులు చాలా విధాలుగా నష్టపోయారు. ఒక పక్క ఎండ ప్రభావంతో కోళ్లు మృత్యువాత పడ్డాయి. మరో సందర్భంలో కమీషన్ దారులు సిండికేట్ కావడం ద్వారా ధర పెరగకుండా నియంత్రించారు. కమీషన్‌దారుల సిండికేట్‌తో విసిగిపోయిన రైతులు ఏకపక్షంగా గుడ్లు కట్టకుండా నిలిపివేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇలా నాలుగు రోజులు రైతులు సమష్టిగా సమస్యలను ఎదుర్కొవడంతో మరలా కమీషన్‌దారులు దిగి వచ్చారు. రైతులతో సయోధ్య కుదరడంతో గుడ్డులను అమ్మకాలు చేశారు. గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్న రైతులకు ప్రస్తుతం గుడ్డు ధర కొంత ఊరటనిచ్చింది.

జిల్లాలో కోటి 5 లక్షల గుడ్ల ఉత్పత్తి

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జిల్లా వ్యాప్తంగా 270 మంది రైతులకు కోటి 30లక్షలు కోళ్ల కెపాసిటీతో పౌల్ట్రీలు ఉన్నాయి. కాగా ప్రస్తుతం కోటి 5 లక్షల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఉత్పత్తి అయిన వాటిలో 30 శాతం (30లక్షల గుడ్లు) స్థానికం గానే వినియోగం అవుతున్నాయి. మిగిలిన 70 శాతం గుడ్లు ఇతర రాష్ట్రాల కు ఎగుమతి అవుతున్నాయి. ప్రధానంగా పశ్చిమ బెంగాల్, అసోం, బిహార్ రాష్ట్రాలకు ఇక్కడి నుంచి గుడ్లు ఎగుమతి అవుతున్నాయి.



ధర ఆశాజనకం

గుడ్డు ధరలు ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నాయి. నెల రోజుల నుంచి ధరలో తీవ్ర వ్యత్యాసంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కొంతవరకు మంచి ధర లభించడంతో రైతులు ఊపిరి పీల్చుకునే వెసులుబాటు కలిగింది. మరికొన్ని రోజులు ధర ఇలా ఉంటే కాస్త రుణాలు, ఇతర ఖర్చుల నుంచి బయటపడే అవకాశం ఉంది.

- కొమాట్లపల్లి వెంకట సుబ్బారావు, తణుకు

మహో మాయగాడు



అతడు వేదికపై ఉన్నాడంటే మన కళ్లు మనల్ని మోసం చేస్తాయి. నిజమా.. మాయా.. అనే సంభ్రమాశ్చర్యాల్లో ముంచేసే మహా మాయగాడు మన గుగాంపు. కర్ర కదిపితే పూల బొకే ప్రత్యక్షమవుతుంది. ఖాళీ జగ్గు నుంచి నీళ్లు పోస్తాడు. అతడి మ్యాజిక్‌తో రెండు గంటల పాటు మాయ చేసేస్తాడు. ఆచంట మండలం ఎ.వేమవరం గ్రామానికి చెందిన గుడాల గాంధీ పుష్కరుడు గుగాంపు పేరుతో మెజీషియన్‌గా చిరపరిచితుడు. దుబాయ్‌లో స్థిరపడిన గుగాంపు ఇంద్రజాలంలో అనేక అవార్డులు అందుకున్నారు. తాజాగా మ్యాజిక్‌లో అత్యున్నత పురస్కారమైన అమెరికన్ మెర్లిన్ అవార్డు అందుకున్నారు. రెండు సార్లు ఈ అవార్డు అందుకున్నట్లు గర్వంగా చెబుతారు.

మన గుగాంపు

- అంతర్జాతీయ వేదికలపై ఇంద్రజాల ప్రదర్శన
- ప్రతిష్టాత్మక అమెరికా మెర్లిన్ అవార్డు కైవసం
- స్వస్థలం ఆచంట వేమవరం
- దుబాయ్‌లో స్థిర నివాసం



ఆచంట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆచంట వేమవరం గ్రామానికి వెళ్లి ఎవరినైనా గుడాల గాంధీ పుష్కరుడి గురించి అడిగితే ఐదు నిమిషాలు ఆలోచిస్తారు. గుగాంపు అని అడిగితే అర క్షణంలో అందరూ చెబుతారు. స్వగ్రామంలోనే కాదు ఎక్కడైనా గుగాంపు పేరు చిరపరిచితం. ఆచంట వేమవరం గ్రామానికి చెందిన అంతర్జాతీయ ఇంద్రజాలికుడు డాక్టర్ గుగాంపు (గుడాల గాంధీ పుష్కరుడు) దుబాయ్‌లో స్థిరపడ్డారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఇంద్రజాల ప్రదర్శనతో ప్రతిభ కనబరిచిన గుగాంపు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ఇటీవల అమెరికా లాస్‌వేగాస్‌లో ప్రతిష్టాత్మక మెర్లిన్ అవార్డును కైవసం చేసుకున్నారు. అనంతరం ఫోన్ ద్వారా గ్రామస్తులు, బంధువులతో ఆనంద క్షణాలను పంచుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా దేశ విదేశాల నుంచి 37 మంది అంతర్జాతీయ ఇంద్రజాలికులు ఈ అవార్డుకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. విశాఖపట్టణానికి చెందిన బీఎస్‌రెడ్డితో పాటు తాను మ్యాజిక్‌లో అత్యున్నత పురస్కారం అమెరికన్ మెర్లిన్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ మెజిషియన్ సొసైటీ ఛైర్మన్ టోని ఆశిని నుంచి అవార్డును స్వీకరించడం మాటల్లో చెప్పలేనంత అనుభూతి కలిగిందన్నారు. 2016లో మొదటిసారి ఈ అవార్డు తీసుకున్నట్లు తెలిపారు. తాను ఎంచుకున్నరంగంలో అత్యున్నత స్థాయికి ఎదగడంలో ముఖ్యభూమిక పోషించిన మాతృదేశం, స్వగ్రామానికి ఎపుడూ రుణపడి ఉంటానని ఆయన తెలిపారు.

విద్యుత్ వినియోగదారులకు అండ

కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రసల్ ఫోరమ్‌తో సమస్యల పరిష్కారానికి కృషి

ఫోరమ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ



ఎన్ఆర్‌పీ అగ్రహారంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఉండి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రసల్ ఫోరమ్ ధ్యేయమని చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి బి.సత్యనారాయణ అన్నారు. ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారం పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో విద్యుత్ వినియోగదారులతో సమావేశం శుక్రవారం జరిగింది. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి సమస్యలు వచ్చిన తమ ఫోరమ్ దృష్టికి తీసుకుని రావచ్చని తెలిపారు.

టోల్ ఫ్రీ నంబర్ 1912

గ్రీవెన్స్ రిడ్రసల్ ఫోరమ్ టోల్ ఫ్రీ నెంబరు 1912 కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. బిల్లింగ్ తప్పుగా నమోదు కావడం, బకాయిలు వసూలు, లోపం ఉన్న మీటరు సమస్యలు, కాలిపోయిన మీటరు, సరఫరాలో అంతరాయం, సరఫరా లోపం, లో ఓల్టేజీ, సర్వీసు లోపం, కొత్త కనక్షన్ ఇవ్వడంలో ఆలస్యం తదితర సమస్యలపై నిర్దిష్టంగా తమదృష్టికి తీసుకు రావచ్చని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలపై పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విశాఖపట్నం కేంద్రం పరిధిలో వినియోగదారులకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ జిల్లాలో నెలకొకసారి వినియోగదారులకు సమావేశాలు నిర్వహించి సమస్యలను స్వీకరిస్తామని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సత్యనారాయణ వివరించారు. కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రసల్ ఫోరమ్ ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల వినియోగదారుల సమస్యలపై పనిచేస్తామన్నారు. తెలిపారు. తమ దృష్టికి వచ్చిన సుమారు 8,950 పైగా సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. ఉండి మండలం నుంచిపలువురు వినియోగదారులు విద్యుత్ సమస్యలపై వారికి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఫోరమ్ సభ్యులు ఎస్.సుబ్బారావు, ఎస్‌రాజబాబు, ఎన్ మురళీకృష్ణతో పాటు విద్యుత్ అధికారులు ఎం.వెంకటేశ్వరరావు, ఎం.ఝాన్సీ, యు.శ్రీనివాసరావు, ఎ.వెంకటరావు, పి.శ్రీనివాసరావు, సిబ్బంది, బీజేపీ మండల అధ్యక్షుడు విక్రమ్, బ్యాంక్ మాజీ చైర్మన్ శ్రీహరిరాజు, గ్రామ మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు, అధిక సంఖ్యలో విద్యుత్ వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.


బాస్కెట్‌బాల్ పోటీల్లో విజయం సాధించిన ఏలూరు బాలికల జట్టు

బాస్కెట్‌బాల్ విజేత ఏలూరు జిల్లా జట్టు

ఏలూరు రూరల్, ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమరావతి ఛాంపియన్‌షిప్ కప్ పేరుతో క్రీడా పోటీలను నిర్వహిచింది. కాకినాడలో శుక్రవారం జోన్ 2 లెవెల్ బాస్కెట్‌బాల్ పోటీలు జరిగాయి. పోటీలో ఏలూరు జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచింది. ఉదయం సెమీఫైనల్స్ పోటీలు జరిగాయి. కోనసీమ జిల్లాతో ఏలూరు జట్టు తలపడింది. 24-59 స్కోర్‌తో ఫైనల్స్‌కు చేరుకుని ఫైనల్స్‌లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై 35-16 స్కోర్‌తో విజేతగా నిలిచింది. ఈనెల 24, 25, 26 తేదీలలో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపికైందని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ జి.శ్రీనివాసరావు, కె.మురళీకృష్ణ తెలిపారు.

శ్రీవారి సేవలో కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి


స్వామివారి చిత్రపటం ఇస్తున్న డిప్యూటీ ఈవో

ద్వారకాతిరుమల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.సుమలత శుక్రవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆమెకు అర్చకులు, దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బంగారు వాకిలి నుంచి లోనికి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. అలయ డిప్యూటీ ఈవో భద్రాజీ ఆమెకు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపివేత

కలెక్టరేట్ వద్ద డయాలసిస్ బాధితుల ఆందోళన

ఉన్నతాధికారులతో మాట్లాడి పునరుద్ధరించిన జేసీ


ఆందోళన చేపట్టిన బాధితులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయి

భీమవరం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో డయాలసిస్ రోగులకు ఎన్టీఆర్ వైద్య సేవ నిలిపివేశారని బాధితులు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుమారు 200 మంది డయాలసిస్ పేషెంట్లు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగడంతో పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు మద్దతు తెలిపారు. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి జి.గీతాబాయికి సమస్య వివరించారు. కొన్ని కారణాల వల్ల ఆ ఆస్పత్రి సేవలు పూర్తిగా నిలిపివేశామని, తణుకు, తాడేపల్లి గూడెం హాస్పిటల్‌కు వెళ్లాలని వైద్యాధికారి సూచించారు. అంతదూరం వెళ్లలే మని బాధితులు జేసీకి వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రస్తుతం వైద్య సేవలు పునరుద్ధరించామని, వెంటనే వెళ్లి చికిత్స పొందాలని చెప్పారు. కొత్త పేషెంట్లకు మాత్రం ఆకాశం లేదని చెప్పారు. ప్రస్తుతం ఎవరికీ చికిత్స ఆగదని జేసీ, జిల్లా వైద్యాధి కారి హామీ ఇవ్వడంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు.

వైసీపీ పాలనలో డీసీసీబీకి రూ.100 కోట్ల నష్టం : ఆప్కాబ్ చైర్మన్ గన్ని


సొసైటీ చైర్మన్ అప్పన్నను అభినందిస్తున్న గన్ని, వలవల బాబ్జి తదితరులు

పెంటపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ఉన్న డీసీసీబీ గత వైసీపీ పాలనతో రూ.100 కోట్లు నష్టాలలో కూరుకుపోయిందని ఆప్కాబ్, డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు విమర్శించారు. ముదునూరు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. సొసైటీ చైర్మన్ల సహకారంతో డీసీసీబీని తిరిగి గాడిలో పెడతామన్నారు. భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి త్రిసభ్య కమిటీ కృషి చేయాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ కమిటీ సభ్యులు సొసైటీ ఆదాయాన్ని పెంచేలా కృషి చేయాలన్నారు. సొసైటీ చైర్మన్ దాసరి అప్పన్న, సభ్యులు బుద్దన ధనరాజు, బుద్దన నారాయణను శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, బండారు వెంకట్రావు, పుల్లా బాబి, గంధం సతీష్, పాతూరి రాం ప్రసాద్ చౌదరి, దత్తు ప్రసాద్, దాసరి కృష్ణవేణి, బండి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయం పెంచాలి


స్వమిత్వ సర్వే పరిశీలిస్తున్న కృష్ణతేజ

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఆదాయం పెంచేదిశగా సిబ్బంది పనిచేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ అన్నారు. కృష్ణాయపాలెం, పెదతాడేపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. సచివాలయ రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న స్వమిత్వ సర్వేపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సర్వేలో ప్రాపర్టీ పోర్టల్ మ్యాప్ దగ్గర ఉంచుకుని సిబ్బంది సర్వే చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు బొలిశెట్టి రాజేష్ కృష్ణతేజకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. డీపీవో ఎస్.రామనాథరెడ్డి, డ్వామా పీడీ అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేశ్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సోమేశ్వరరావు, ఏఈ రాజాశ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు పరిమి వెంకటకృష్ణ, బేదపూడి వెంకటేశ్వర రావు, కార్యదర్శులు వై.హరికిశోర్, టి.రవిచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కలుపు మొక్కలను నియంత్రించాలి


కలుపు నివారణను వివరిస్తున్న శాస్త్రవేత్తలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కలుపు మొక్క వయ్యారి భామ అత్యంత ప్రమాదకరమని, నియంత్రించాల్సిన అవసరం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఇ.రేఖ అన్నారు. వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కృషివిజ్ఞాన కేంద్రం వద్ద వారం రోజుల పార్థేనియం(వయ్యారిభామ మొక్కలపై) అవగాహన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. మరో శాస్త్రవేత్త డాక్టర్ ఎ.దేవి వరప్రసాదరెడ్డి మాట్లాడుతూ వయ్యారి 1950న గుర్తించగా 35 మిలియన్ హెక్టార్ల మేర విస్తరించిందన్నారు. ఒక మొక్క 50 వేల విత్తనాలు వెదజల్లుతుందన్నారు. ఈ మొక్కల నివారణకు గ్లైకోసైట్ లేదా మెట్రిబ్యూషన్‌తో అరికట్టవచ్చని వివరించారు.

సాంకేతిక నైపుణ్యంతో సాధికారత


విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సాంకేతిక నైపుణ్యాలతోనే యువత సాధికారత సాధ్యమని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ జీబీ వీరేష్ కుమార్ అన్నారు. నిట్, శశి ఇంజనీరింగ్ కళాశాలలో భాగస్వామ్యంతో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 'పోర్ట్ ఇన్స్పైర్ ఏ కెరీర్ అండ్ కార్పొరేట్ ఫెస్ట్' కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. వీరేష్‌కుమార్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆధునిక సాంకేతిక రంగంలో సమకాలీన, సృజనాత్మక ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. మెర్సిడెస్ బెంజ్ కంపెనీ సీనియర్ ఇంజనీర్(బెంగళూర్) అయ్యార్ భట్టాచార్య మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. టి హబ్ డైరెక్టర్ (హైదరాబాద్) అవినాష్ కేదర్, ప్యూజీ టెక్ ఉపాధ్యక్షుడు చాణిక్య మాట్లాడుతూ అంకుర పరిశ్రమలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. పి.శంకర్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. తొలిరోజు హ్యాక్‌థాన్ ప్రాజెక్టును పరిశీలించారు. కార్యక్రమంలో రేణికుంట్ల విజయ్‌కుమార్, ఆయా కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం పరిశీలనలో జర్నలిస్టుల రైల్వే పాస్‌లు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):జర్నలిస్టులకు రాయితీపై రైల్వే పాస్‌ల సౌకర్యాన్ని పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోందని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ తెలిపారు. పార్లమెంట్‌లో ఎంపీ అడిగి ప్రశ్నలకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానాలు ఇచ్చారు. జర్నలిస్టులకు పాస్‌లు ఇచ్చేందుకు పరిశీలిస్తున్నామని మంత్రి జవాబిచ్చారు.

రాష్ట్రంలో ఆరు గ్యాస్, పెట్రోల్ బ్లాకులు గుర్తింపు

రాష్ట్రంలో ఆరు గ్యాస్, పెట్రోల్ బ్లాక్‌లను గుర్తించినట్లు కేంద్రమంత్రి సురేశ్ గోపి ఎంపీ మహేశ్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. దేశంలో మొత్తం 54 బ్లాక్‌లు ఉంటే రాష్ట్రంలోనే ఆరు పెట్రోల్, గ్యాస్ బ్లాక్‌లు ఉన్నాయన్నారు. 182.7 మిలియన్ మెట్రిక్‌టన్నుల చమురు గుర్తించినట్లు మంత్రి వెల్లడించారు.


సమ్మె చేస్తున్న సత్యసాయి మంచినీటి పథకం కార్మికులు

240 గ్రామాలకు తాగు నీరు బంద్

సత్యసాయి మంచినీటి పథకం కార్మికుల సమ్మె ఎఫెక్ట్

పోలవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):సత్యసాయి మంచినీటి పథకం కార్మికుల సమ్మె ఎఫెక్ట్‌తో 240 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. 11 నెలల జీతాల బకాయి వెంటనే చెల్లించే వరకూ మంచినీటి సరఫరా చేయబోమని శుక్రవారం కన్నాపురం అడ్డరోడ్డు వద్ద సుమారు 110 మంది కార్మికులు సమ్మెకు దిగారు. జీతాల బకాయి వెంటనే చెల్లించాలని, జీవో నెం 11 ప్రకారం జీతాలు విడుదల చేయాలని నినాదాలు చేశారు. గత ఐదేళ్లలో సత్యసాయి కార్మికులు సమ్మెకు దిగడం ఇది రెండోసారి. కార్మికుల సమ్మెతో పోలవరం నుంచి చింతలపూడి వరకూ నాలుగు నియోజక వర్గాల్లో సుమారు 240 గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికుల యూనియన్ అధ్యక్షుడు శివ సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల పాదయాత్రలో విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తమను దత్తత తీసుకుని ఆదుకుంటామని హామీ ఇచ్చారని, హామీ నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కారం భాస్కర్, తదితరులు కార్మికులకు సంఘీభావం తెలిపారు.



25న మెగా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వివిధ కేటగిరీ పోస్టులకు ఏపీడీఎస్సీ ఏపీసీఎఫ్ఎస్ఎస్. ఐఎన్ లాగిన్ నుంచి ఇంటిమేషన్ కాపీవచ్చిన అభ్యర్థులు ఆ కాపీని డౌన్‌లోడ్ చేసుకుని, ఈ నెల 25వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిమిత్తం ఏలూరు శివారు వట్లూరులోని సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు హాజరుకావాలని ఉమ్మడి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉమ్మడి జిల్లాలో 1074 పోస్టులు
- 23 కౌంటర్లలో ధ్రువపత్రాల పరిశీలన
- 5లోగా నియామకాల పూర్తి
- కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోనే భారీ వెకెన్సీలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):ఒరిజినల్ ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ, డీఈడీ, బీపీఈడీ, పండిట్ ట్రైనింగ్ సర్టిఫికెట్లతోపాటు, కుల ధ్రువీకరణ, డిజేబుల్డ్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్/రెసిడెన్షియల్ సర్టిఫికెట్, టెట్ మార్కుల కాపీ, డీఎస్సీ హాల్ టికెట్ కాపీ, ఆధార్‌కార్డు, 5 పాస్‌పోర్టు సైజు ఫోటోలను తీసుకుని వెరిఫికేషన్‌కు అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. సర్టిఫికెట్లన్నింటినీ అటెస్టేషన్ చేయించి (మూడు సెట్లు), ఒరిజినల్స్‌తో సహా రావాలని కోరారు. అభ్యర్థికి సహాయకులుగా ఒక వ్యక్తిని మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. వెబ్‌సైట్‌లో లాగిన్ అయి, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్‌చేసి అప్లోడ్ చేయాలని కోరారు.

ఆన్‌లైన్‌లో కాల్ లెటర్లు

ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీ-2025కి సంబంధించి పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రభుత్వ/జడ్పీ/ఎంపీపీ/మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో మొత్తం 1035 ఉపాధ్యాయపోస్టులు భర్తీ చేయనుండగా, వీటిలో స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 615, ఎస్జీటీ కేడర్‌లో 420 ఉద్యోగాలున్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రం పాఠశాలల్లో 32 పోస్టులు భర్తీచేయనుండగా, వీటిలో స్కూల్ అసిస్టెంట్ కేడర్ 18, ఎస్జీటీ కేడర్ 14 పోస్టులున్నాయి. జువనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహిస్తోన్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో 7 పోస్టులను భర్తీచేయనుండగా, వీటిలో 6 ఎస్జీటీ, ఒక పీఈటీ పోస్టు ఉన్నాయి. మొత్తం మీద 1074 పోస్టుల భర్తీకి అభ్యర్థులను 1:1 నిష్పత్తిన ఎంపికచేసి కాల్ లెటర్లను ఆన్‌లైన్‌లో పంపించారు. వీరందరి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిమిత్తం ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 23 కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పరిశీలన కోసం పాఠశాల విద్య డైరెక్టరేట్ నుంచి ఒక జాయింట్ డైరెక్టర్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించనున్నారు. తొలి విడతలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థుల్లో ఎవరైనా అనర్హులుగా తేలితే వారి స్థానంలో తదుపరి మెరిట్‌లో ఉన్న అభ్యర్థిని సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తారు. రెండో విడతలోనూ అనర్హులుంటే మూడో విడతలో తదుపరి అభ్యర్థిని పిలిచి తుది ఎంపికలను ఖరారు చేస్తారు. పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన పోస్టులకు జిల్లా విద్యాశాఖ, మిగతా శాఖలకు సంబంధించిన పోస్టుల భర్తీని సంబంధిత శాఖలు పూర్తిచేస్తాయి. కాగా అన్ని శాఖల పోస్టులకు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను మాత్రం జిల్లా విద్యాశాఖ చేపడుతుంది. మొత్తం మీద సెప్టెంబరు 5న లేదా అంతకంటే కొన్ని రోజులు ముందుగానే కొత్త ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లిచ్చే అవకాశం ఉంది.

విలీన మండలాలకు టీచర్లు ఫుల్

ఉమ్మడి జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పాఠశాలల్లో టీచర్లు లేకపోవడంతో బోధన సజావుగా సాగడం లేదు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలతోపాటు, కనీస వేతన స్కేలుపై అక్కడ ఈ మండలాల్లో పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులందరూ కౌన్సెలింగ్‌లో వేరే మండలాలకు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో టీచర్ల కోసం ఈ రెండు మండలాల్లో విద్యార్థి, ప్రజాసంఘాలు రోడ్డెక్కాల్సిన పరిస్థితులు వచ్చాయి. తాజాగా జరుగుతున్న మెగా డీఎస్సీలో నియమితులయ్యే స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలకు 90 శాతం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోనే వెకెన్సీలుంటాయి. కొన్ని వెకెన్సీలు మాత్రం ఉమ్మడి జిల్లాలోని ఇతర మండలాల్లో ఉంటాయి. ఆ ప్రకారం పాఠశాల విద్యాశాఖ కింద భర్తీచేసే మొత్తం 1035 పోస్టుల్లో గవర్నమెంట్/జడ్పీ యాజమాన్యాల కింద నియామకాలు జరిగే మొత్తం 837 ఉపాధ్యాయ ఉద్యోగాల్లో 577 స్కూల్ అసిస్టెంట్ కేడర్, 260 ఎస్జీటీ కేడర్ అభ్యర్థులకు అత్యధిక శాతం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోనే పోస్టింగ్‌లు లభిస్తాయి. ఇవిగాక ఉమ్మడి జిల్లాలోని మున్సిపాల్టీల్లో 153 పోస్టులు, ఏలూరు నగరపాలక సంస్థలో 45 పోస్టులున్నప్పటికీ డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ సమయంలోనే ఆయా యాజమాన్యాలకు అభ్యర్థుల నుంచి అభీష్టాలను తీసుకున్నందున ఇతరులను నియమించే అవకాశం లేదు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తపనా చౌదరి

3న బీజేపీ అధ్యక్షుడు మాధవ్ రాక

విజయవంతం చేయాలని తపన చౌదరి పిలుపు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

సారథ్యం యాత్రలో భాగంగా వచ్చే నెల 3న ఏలూరు వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎల్.మాధవ్ పర్యటనను ప్రతి బీజేపీ కార్యకర్త విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరి పిలుపునిచ్చారు. ఏలూరులో శుక్రవారం మాధవ్ పర్యటన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాధవ్ తొలిసారి ఏలూరు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల 3న ఉదయం చాయ్‌పే ప్రత్యేక కార్యక్రమం, శోభాయాత్ర, అనంతరం సుఖీభవలో నిర్వహించే జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో మాధవ్ పాల్గొంటారన్నారు. బీజేపీ కార్యకర్తలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబరుగా, సర్పంచ్‌గా, ఎంపీటీసీ, జడ్పీటీసీగా పోటీ చేయడానికి కూటమి తరఫున అవకాశం అడగాలంటే మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలా కిశోర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబికా కృష్ణ, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, శరణాల మాలతీరాణి, జ్యోతి సుధాకర కృష్ణ, కృష్ణప్రసాద్, అశోక్ చక్రవర్తివర్మ, నూజివీడు ఏఎంజీ చైర్మన్ అరుణ, ఏలూరు ఏఎంసీ వైస్ చైర్మన్ వాణీభాస్కర్ పాల్గొన్నారు.

బీజేపీ ఉపాధ్యక్షులుగా తపన, నిర్మల

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)


తపన చౌదరి, నిర్మలా కిశోర్, ఆదిలక్ష్మి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో ఏలూరు జిల్లా నేతలకు ప్రాధాన్యత లభించింది. ఇంతకు ముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న తపన చౌదరి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న నిర్మలా కిశోర్‌లను తాజా కమిటీలో ఉపాధ్యక్షులుగా నియమించారు. ఏలూరు జిల్లాకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎల్.మాధవ్ కూర్పుచేశారు. తపన చౌదరి గత పార్లమెంటు ఎన్నికల్లో ఏలూరు స్థానాన్ని ఆశించారు. తగ్గట్టుగానే ఆయన నిర్విరామంగా నియోజకవర్గంలో కృషి చేశారు. ఖర్చుకు ఎక్కడా వెనుకాడలేదు. అయితే ఎంపీ స్థానం దక్కలేదు. పొత్తుల నేపథ్యంలో ఏలూరు స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి పోటీ చేశారు. అయినా నిరాశ చెందకుండా ఆయన పార్టీ కార్యక్రమాల్లోనే నిమగ్నమవుతూ వచ్చారు. ఉత్తరాంధ్ర పరిశీలకులుగా ఉన్న చౌదరికి ప్రమోషన్ ఇచ్చి ఉపాధ్యక్షులుగా నియమించడంతో పార్టీలో హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. ఇప్పటి వరకు మహిళా మోర్చా అధ్యక్షురాలిగా వ్యవహరించిన నిర్మలా కిశోర్‌ను మరో ఉపాధ్యక్షురాలిగా నియమించారు.

రాష్ట్ర కార్యదర్శిగా ఆదిలక్ష్మి

తాడేపల్లిగూడెం: బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా భోగిరెడ్డి ఆదిలక్ష్మి ఎంపికయ్యారు. తాడేపల్లిగూడేనికి ఈమె 1992లో బీజేపీలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. 1994లో తాడేపల్లిగూడెం అసెంబ్లీ ఎన్నికలో బీజేపీ తరఫున పోటీ చేశారు. పార్టీలో ఇంకా పలు పదవులు నిర్వహించారు. తనను ఎంపిక చేసిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎంపీ పాకా సత్యనారాయణకు, జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గూడెం నియోజకవర్గం కన్వీనర్‌తాతాజీ, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌లు ఆమెను అభినందించారు.


గూటాల సొసైటీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఎరువుల కోసం రైతుల ఆందోళన

పోలీసుల రంగ ప్రవేశం

పోలవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పోలవరం మండలం గూటాల పీఏసీఎస్ వద్ద శుక్రవారం ఎరువుల కోసం రైతులు ఆందోళన నిర్వహించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేసి బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు మాట్లాడుతూ గూటాల ఆయకట్టులో 2,500 ఎకరాలు సాగులో ఉన్నాయని సొసైటీలో కేవలం 250 బస్తాలు మాత్రమే స్టాకు ఉందని సిబ్బంది చెబుతున్నారన్నారు. రైతులకు అవసరమైన ఎరువుల పంపిణీ సకాలంలో చేయకపోతే ఖరీఫ్ సాగు కష్టమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యవసాయాధికారి ఏమన్నారు..?

మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబును వివరణ కోరగా గూటాల సొసైటీలో 500 లీటర్ల నానో యూరియా, 250 బస్తాల యూరియా నిల్వ ఉందని మొత్తం యూరియా 1,500 ఎకరాలకు సరిపోతుందన్నారు. ఎరువులు ఎవరికి వారు ముందుగా తీసుకోవాలనే ఆతృతలో రైతులు తొందరపడి ఆందోళన చేశారని, యూరియా కోసం ఇండెంట్ పెట్టడం జరిగిందని, రానున్న రెండు రోజుల్లో 50 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులోకి వస్తుందని రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు.

క్రైం సమాచారం

భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య


నాగేశ్వరరావు మృతదేహం

కొయ్యలగూడెం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): డబ్బుల విషయమై భార్యతో గొడవ పడి పురుగుల మందు తాగిన భర్త చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొయ్యలగూడెం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలివి.. పట్టణానికి చెందిన పనసకాయల నాగేశ్వరరావు భార్యతో డబ్బుల విషయంలో గొడవ జరగడంతో మనస్తాపంతో ఈ నెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు అతనిని కొయ్యలగూడెం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కోడలిని ఫస్ట్‌ఫ్లోర్ నుంచి కిందికి గెంటిన అత్త

- తీవ్ర గాయాలు.. విజయవాడ ఆసుపత్రికి తరలింపు

ఆకివీడు ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):కోడలిని అపార్ట్‌మెంట్ మొదటి ఫ్లోర్ నుంచి అత్త కిందకు తోసేయడంతో తీవ్రగాయాలైన ఘటన ఆకివీడులో జరిగింది. శుక్రవారం ఆకివీడు కాకరపర్తి చెంచయ్య వీధిలోని అపార్ట్‌మెంట్ ఫస్ట్ ఫ్లోర్‌లో వేంపాడు భానుమూర్తి, సుబ్బలక్ష్మి ఉంటారు. స్థానికులు తెలిపిన వివరాలివి.. కొడుకు, కోడలు తమిళనాడు రాయ్‌వెల్లూరులో ఉంటారు. ఇటీవల సుబ్బలక్ష్మి రాయ్‌వెల్లూరు వెళ్లి వచ్చే సమయంలో పూజల నిమిత్తం కోడలు హేమ సింధూజను ఆకివీడు తీసుకొచ్చింది. సుమారు రెండు నెలలు నుంచి ప్రతిరోజు కోడలిని అత్త చిత్రహింసలకు గురిచేస్తుంది. ఈనేపథ్యంలో శుక్రవారం కోడలు సింధూజను అత్త సుబ్బలక్ష్మి అపార్ట్‌మెంట్ ఫస్ట్‌ఫ్లోర్ నుంచి కిందకు తోసేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. తొలుత స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపించారు. మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించినట్లు స్థానికులు తెలిపారు. కోడలి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సమాచారం. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి అత్త, మామను స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు.

ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ.. కేసు నమోదు

టి.నరసాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై కేసు నమోదు చేశామని ఎస్ఐ జయబాబు తెలిపారు. రాజుపోతేపల్లి తిరుమలదేవిపేట గ్రామ శివారులో ఈనెల 21న రైతుల వ్యవసాయ భూముల్లో గల ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి వాటిలోని కాపర్‌వైరు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనపై ఏఈ దాసరి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సారా కలిగి ఉన్న వ్యక్తిపై కేసు

టి.నరసాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):అక్రమంగా నాటు సారా కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని టి.నరసాపురం మండలం బంధంచర్లలో శుక్రవారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించగా నత్తా కల్యాణ్‌కు చెందిన 50 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి అతడి వద్ద నుంచి ఒక లీటర్ సారా స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు శివారు ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేసి ఒక ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పెదపాడు ఎస్ఐ కట్టా శారదా సతీశ్ తెలిపారు. వాహనంతో పాటుగా వాహనంలోని చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాకు యువత సహకరించాలి

- ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు


సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు.. సదస్సులో విద్యార్థినులు

ఏలూరు క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు యువత సహకరించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు విద్యార్థులకు సూచించారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కిశోర్ ఏలూరు సీఆర్‌రెడ్డి కాలేజీలో శుక్రవారం సాయంత్రం ఏలూరు త్రీటౌన్ సీఐ వి. కోటేశ్వరరావు, జిల్లా శక్తి టీమ్‌లు కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మత్తుపదార్థాలు శారీరక మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతిని చదువులలో వెనుకబడి వారి బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. వారిపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు అడియాసలు అవుతాయన్నారు. ఒక విద్యార్థి డ్రగ్స్‌కు అలవాటు పడినట్టు ముందుగా అతడి స్నేహితులకు తెలుస్తుందని వెంటనే వారు కాలేజీ యాజమాన్యానికి కాని, పోలీసులకు గాని తెలియజేస్తే వారికి డ్రగ్స్‌కు దూరంగా ఉండేటట్లు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నా రు. డ్రగ్స్‌కు బానిసలైన వారిని గుర్తించి డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించి వాటిని మాన్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మత్తుపదార్థాలు వ్యాపారం చేస్తున్నా, వినియోగిస్తున్న వారి సమాచారం 1972కు గాని, 112గాని తెలియజేయాలని సూచించారు.

ఈఎంఐ కట్టమంటే కొట్టేశారు..?

- ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో కలెక్షన్ స్కాం
- కస్టమర్ల సొమ్ము జమ చేయకుండా మేనేజర్ స్వాహా..!
- ప్రాథమిక విచారణలో 26 మంది సొమ్ము గల్లంతు


ఫైనాన్స్ సిబ్బందిని నిలదీస్తున్న బాధితులు

నరసాపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్తూట్ ఫిన్‌కార్ప్ ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ల స్కాం శుక్రవారం వెలుగు చూసింది. ఆస్తుల తాకట్టు పెట్టి రుణం తీసుకున్న కస్టమర్ల సొమ్మును ప్రతి నెల సంస్థకు జమ చేయకుండా మేనేజర్ వినోద్ స్వాహా చేశాడు. అప్పు తీసుకున్న కస్టమర్లు సొమ్ములు బకాయిలు ఉండడంతో ప్రధాన కార్యాలయం నుంచి నోటీసులు అందాయి. దీంతో వారు కార్యాలయానికి వెళ్లి మేనేజర్‌ను నిలదీశారు. మొత్తం ఈ వ్యవహారం బయటపడింది. సంస్థ కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదుచేశారు. ముత్తూట్ కేంద్ర కార్యాలయం నుంచి ఆర్‌ఎం స్థాయి అధికారి నాగరాజు వచ్చి విచారణ చేశారు. ప్రాథమిక దర్యాప్తులో 26 మంది కస్టమర్ల సొమ్ము సుమారు రూ.8 లక్షలను మేనేజర్ సంస్థకు జమ చేయలేదని తేలిందన్నారు. ఇంకా లోతైనా విచారణ చేస్తున్నామన్నారు. నివేదికను కేంద్ర కార్యాలయానికి అందించి వారి సూచనల ప్రకారం మేనేజర్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కస్టమర్లకు ఏం చేయాలన్న దానిపై ఆలోచిస్తామన్నారు. ఈ విషయం బయటకు గుప్పుమనడంతో ఈ సంస్థలో అస్తులు పెట్టి రుణాలు తీసుకున్న కస్టమర్లు ఆందోళన చెందుతున్నారు.

ఏలూరు జిల్లాలో వాహనాల తనిఖీలు


ఏలూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న ఏలూరు త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు

ఏలూరు క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రధాన రహదార్లపై పోలీసులు సాయంత్రం విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. అక్రమ మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ఆకస్మికంగా తనిఖీలను చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా ప్రజలకు రోడ్డు ప్రమాద నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలను తనిఖీ చేసి రికార్డులు సరిగా లేనివారికి, డ్రైవింగ్ లైసెన్సు లేనివారికి ఈ-చలానాలు విధించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడిపేవారికి కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు. ప్రతి వాహనానికి అవసరమైన రికార్డులతోపాటు ఇన్సూరెన్స్ కచ్చితంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనంపై ట్రిపుల్ రైడింగ్ ప్రమాదకరమన్నారు. వర్షాల నేపథ్యంలో రోడ్లు జారే అవకాశం ఉన్న దృష్ట్యా అతి వేగం ప్రమాదకరమని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు.

అర్బన్ పీహెచ్‌సీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు

ఏలూరుఅర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లాలో పలు అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలె(యూపీహెచ్‌సీ) భవన నిర్మాణాలకు 15వ ఆర్థికసంఘం గ్రాంటు నుంచి నిధులను మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులను శుక్రవారం ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు జారీ చేశారు. ఒక్కో యూపీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.కోటి చొప్పున కేటాయించారు. ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం హరిజన పేట-1, చింతలపూడి, ఏలూరులో శనివారపు పేట-1, వెంకటాపురం-1, సత్రంపాడు-1 యూపీహెచ్‌సీలు, పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు కొమ్మయ్య చెరువుగట్టు యూపీహెచ్‌సీలకు నిధులు మంజూరు చేశారు.


108 వాహనంలో ప్రసవించిన బిడ్డ

అంబులెన్స్‌లో ప్రసవం

- తల్లీబిడ్డ క్షేమం

మొగల్తూరు. ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోడి గ్రామానికి చెందిన దుర్గాభవానీ 108 వాహనంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. శుక్రవారం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో ప్రసవం కోసం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో మార్గమధ్యలో అంబులెన్స్‌ను ఆపి టెక్నీషియన్ సుధీర్‌కుమార్ సపర్యలు చేస్తుండగా మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల పోస్టుకార్డు ఉద్యమం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జగ్గన్నపేట సచివాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం పోస్ట్‌కార్డుల ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల హామీలో భాగంగా భవన నిర్మాణ పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరిస్తామని సీఎం చంద్రబాబు , ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు పోస్టుకార్డులు వేశారు.

30న బీజేపీ స్ఫూర్తి కార్యక్రమం

భీమవరం టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న విజయవాడలో బీజేపీ ఆధ్వర్యంలో 'స్ఫూర్తి' కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఏపీ కృష్ణ బలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో స్ఫూర్తి కార్యక్రమ కరపత్రాన్ని విడుదల చేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణ గౌడ్, జిల్లా ప్రెసిడెంట్ గున్నేపల్లి పుల్లాజీ, యువమోర్చా సభ్యులు కంచెర్ల రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో సంచార కులాల్లోని మేధావులు, పెద్దలతో సమావేశం ఉంటుందని తెలిపారు.

ఎస్ఎల్‌వి అపార్ట్‌మెంట్‌లో పడిపూజ



భీమవరం టౌన్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్ఎల్‌వీ సూర్య, తిరుపతి రాజు అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజను వైభవంగా నిర్వహించారు. వేగేశ్న అప్పల రాజు,(నాని)దంపతులచే పూజలు చేయించారు. హంస వాహనంలో స్వామి వారి చిత్రపటాలను ఉంచారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం 18 మెట్లకు ప్రత్యేకపూజలు చేయించారు. అయ్యప్పలు దంపతులను ఆశీర్వదించారు.

మెడికల్ రిప్‌ల సమస్యలు పరిష్కరించాలి

తణుకు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేసి 44 లేబర్ కోడ్‌లను పునరుద్ధరించాలని మెడికల్ రిప్రజంటేటివ్స్ యూనియన్ శాఖ కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. శుక్రవారం సమస్యలు పరిష్కారం కోసం తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ రిప్స్‌కు నిర్దిష్ట పని విధానాన్ని అమలు చేయాలని, గతంలో ఉన్న ట్రిబ్యునల్‌ను కొనసాగించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో మెడిక్ రిప్స్ పనిచేయుటకు అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పీవీప్రతాప్, గార రంగారావు, అజయకుమారి పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వమిత్వ సర్వే



కాపవరంలో ఇంటి సరిహద్దులు కొలుస్తున్న దృశ్యం

పాలకొల్లు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్ర జ్యోతి): పాలకొల్లు రూరల్ మండలంలో నాలుగురోజులు నుంచి స్వమిత్వ సర్వే కార్యక్రమాన్ని పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్నారు. గతంలో రైతులకు సంబంధించిన పొలాల్లో రీసర్వే చేపట్టి పూర్తిచేశారు. తదుపరి సర్వేలో భాగంగా గ్రామాల్లోని ఇంటి సరిహద్దులు, ఇళ్ల స్థలాలు, ఖాళీ స్థలాల్లో సర్వే చేస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో టి.మూర్తిబాబు తెలిపారు. ముందుగా ఇంటి యజమానికి 7ఎ నోటీసు ఇచ్చి ఇంటి సరిహద్దులను కొలిచి నిజ నిర్ధారణ చేయనున్నారని అయన తెలిపారు. చివరగా 9ఎ నోటీసు ఇచ్చి సర్వే పూర్తిచేస్తామన్నారు.

'శెట్టి ఆస్తుల్ని కాపాడాలి'

నరసాపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ శెట్టివారి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి గురు ప్రసాద్, పీడీ రాజు, కవురు పెద్దిరాజు విన్నవించారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ శెట్టిగారి ఆస్తుల్ని విద్యాపరంగా అభివృద్ధి చేయాలే తప్ప ఇలా దౌర్జన్యంగా యాజమాన్యం ఆక్రమించుకోవడం దారుణమన్నారు. శెట్టిగారి స్థలంలో 30ఏళ్లగా లీజు పద్ధతిలో నివాసం ఉంటున్న కుటుంబాలను ఉన్నపళంగా కొందరు వ్యక్తులతో బెదిరించి ఖాళీ చేయించమనడం సరికాదన్నారు.

ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి

భీమవరం టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగు మహాకవుల రచనలు యుగాంతం వరకు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, తెలుగు భాషాభివృద్ధి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వీరమ్మ పార్కులోని తెలుగుతల్లి విగ్రహం వద్ద శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని, భాషోద్యమ నాయకులు గిడుగు రామ్మూర్తి జయంతి నిర్వహించారు. ముందుగా తెలుగు మహాకవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు పండితులు కలిగొట్ల గోపాల శర్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మద్దుల రాము, కార్యదర్శి చెల్లబోయిన గోవింద్, తెలుగు పండితులు డా నాగేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.



ఆకివీడులో వాసవీమాతకు అలంకరణ.. పాలకొల్లులో కనకదుర్గమ్మ



క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు

వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమ పూజలు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ దేవి వ్రతాలు చేసుకున్నారు. సుమారు 1500 మంది మహిళలు పూజలు చేసుకున్నారు. కల్యాణ మండపంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలోని పార్వతీ దేవిని, లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. కనక దుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

ఆకివీడు: శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక పెద్దింట్లమ్మ దేవస్థానంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ గొంట్లా గణపతి, ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు, ఈవో ఎ.సత్యనారాయణరాజు, టీడీపీ పట్టణ కార్యదర్శి గంధం ఉమా, కౌన్సిలర్లు కిమిడి అరుణకుమారి, బత్తుల శ్యామల, వార్డు ఇన్‌చార్జి కిమిడి నాగరాజు పాల్గొన్నారు. ఆర్యవైశ్య భవనంలో వాసవి కన్యకా పరమేశ్వరికి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో కాకరపర్తి సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఉండి: రాజులపేటలోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. సన్నిధిరాజు శేషగిరిరావు ఆధ్వర్యంలో మహిళలు పూజలు జరిపారు. శ్రావణపట్టి సారె అమ్మవారికి సమర్పించారు.

భీమవరం టౌన్: మావుళ్ళమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మావుళ్ళమ్మ ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా మహాలక్ష్మి అలంకారం చేశారు. ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో వందలాదిమంది మహిళలు వ్రతంలో పాల్గొనగా వారి చేత అమ్మవారి ఆవాహన, అమ్మవారి ప్రతిమకు పూజలు చేయించారు. అనంతరం శ్రావణ మాస వ్రతకథను వినిపించారు. అమ్మవారికి మహా హారతితో కార్యక్రమాన్ని పరిసమాప్తి చేశారు.



తణుకులో ట్రై సైకిల్ అందజేత.. పాలకొల్లు, అత్తిలిలో శాంతి ర్యాలీ..

ఘనంగా మానవత ఆవిర్భావ దినోత్సవం

శాంతి ర్యాలీలు.. పేదలకు సాయం అందజేత

అత్తిలి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అత్తిలి మండల మానవత అధ్యక్షుడు కోరిపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ దశిక వంశీ శాంతి ర్యాలీని ప్రారంభించారు. మానవత సంస్థ 108 మంది సభ్యులతో ప్రారంభమై 136 మండలాల్లో 80 వేల మంది సభ్యులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటుందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ ఈసీ మెంబర్ ఆనాల ఆదినారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కోరిపల్లి హరి, కోశాధికారి కుక్కల వెంకట రామారావు పూర్వపు అధ్యక్షులు తోట వెంకట సుబ్బారావు, బోడపాటి సూర్యచంద్రరావు, జీవైవీ రమణ, అల్లబావి అప్పారావు, మద్దుల జగదీష్ పాల్గొన్నారు.

తణుకు: మానవత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. సజ్జాపురంకు చెందిన మానసిక వికలాంగురాలు కొప్పిర గాయత్రికి ట్రై సైకిల్ అందజేశారు. వేల్పూరుకు చెందిన రౌతు రంగమ్మకు వైద్య ఖర్చులు నిమిత్తం రూ.5వేలు, రేలంగి గ్రామానికి చెందిన మిరియాల నాగేశ్వరరావుకు రూ.5వేలు, బోడపాటి ప్రసాదుకు రూ.2వేలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, అధ్యక్షుడు కె.రాజరాజేశ్వరరావు, రాష్ట్ర కన్వీనర్ డా.కె.రాధా పుష్పావతి, జిల్లా కన్వీనర్ ఎస్‌వీ సతీష్‌బాబు, రామలక్ష్మి, వంగూరి హనుమంతరావు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: మానవతా భీమవరం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి ర్యాలీ, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలోని అమరవీరుల స్మృతి వనం నుంచి ప్రారంభమైన ర్యాలీని వన్ టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్ ప్రారంభించారు. సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు, అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా త్రిపుర సుందరి అనే బీటెక్ విద్యార్థికి ఫీజు నిమిత్తం రూ.30వేలు, సీనియర్ ఇంటర్ విద్యార్థి చిలకపాటి జాన్ ప్రణయ్‌కి రూ.15వేలు, జూనియర్ ఇంటర్ విద్యార్థి అవినాష్‌కి రూ.15వేలు, వృద్ధ కళాకారుడు మావుళ్ళుకు రూ.10 వేలు అందించారు.

పాలకొల్లు అర్బన్: పట్టణంలో శాంతి ర్యాలీని సీఐ కోలా రజనీ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. గాంధీ బొమ్మల సెంటర్ నుంచి యడ్ల బజారు వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ కొనసాగింది. సంస్థ చైర్మన్ డాక్టర్ కెఎస్‌పిఎన్ వర్మ, కన్వీనర్ ముత్యాల రామారావు, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ ముత్యాల శ్రీనివాస్, డైరెక్టర్ పిఎస్‌ప్రతాప్‌రాజు, మద్దాల వాసు పాల్గొన్నారు.

ఘనంగా మెగాస్టార్ చిరు జన్మదిన వేడుక

కేక్‌లు కట్ చేసిన అభిమానులు.. రక్తదాన శిబిరాలు



మొగల్తూరులో చిరంజీవి చిన్ననాటి ఇంటి వద్ద జన్మదిన కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి రామరాజు తదితరులు.. తణుకులో రక్తదానం

నరసాపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణ, మండలంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల్ని శుక్రవారం మెగా అభిమానులు ఘనంగా నిర్వహించారు. చిట్టవరం గ్రామంలో అభిమానులు మదనగోపాలస్వామి ఆలయంలో పూజలు చేశారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో అభిమానుల సమక్షంలో భారీ కేక్‌ను ప్రభుత్వ విప్ నాయకర్ కట్ చేశారు. కొప్పర్రులోని జనసేన సీనియర్ నాయకులు పోలిశెట్టి శ్రీనువాస్, పోలిశెట్టి యూస్సీల ఆధ్వర్యంలో అభిమానుల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. ఈవేడుకల్లో కోటిపల్లి సురేష్, ఏఎంసీ ఉపాధ్యక్షులు గంగాధర్, కోపల్లి శ్రీను, పోలిశెట్టి సత్తిబాబు, హరిబాబు పాల్గొన్నారు.

ఆకివీడు: వెంకటలక్ష్మి థియేటర్ ప్రాంగణంలో రక్తదాన శిబిరం, కేక్ కటింగ్, పేద మహిళలకు చీరలు పంపిణీని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బిలాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో చిరంజీవి, పవన్‌కల్యాణ్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి సత్యనారాయణ, ఎం.శ్రీహరిరాజు, జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు, మండల కన్వీనర్ దారపురెడ్డి కన్నబాబు, కౌన్సిలర్ గోపిశెట్టి వెంకట సత్యవతి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు,సన్నిధి వెంకన్నబాబు పాల్గొన్నారు.

తణుకు: మెగాస్టార్ చిరంజీవి అభిమానులు రక్తదానం చేశారు. శుక్రవారం తణుకులోని రెడ్ క్రాస్ భవనంలో చిరంజీవి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ ప్రారంభించారు. ఈసందర్భంగా పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి పెండ్యాల సూర్య, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: లుసులమ్మగుడిలో గట్టు గోపికృష్ణ, మట్టా రాంబాబు ఆధ్వర్యంలో అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవిత దివ్యాంగుల కేంద్రంలో నాగబాబు, సుంకర గంగాధర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, పిల్లలకు పండ్లు, పెన్నులు పంచారు. జూబ్లీ రోడ్డులో జరిగిన వేడుకలో చిరంజీవి అభిమాన సంఘం నాయకులు మారిశెట్టి సుబ్బా రావు, మాదాసు వినోద్, రాజనాల మణికంఠ, పిల్లా రాజు, దేవా మణికంఠ, గిరి తదితరులు పాల్గొని కేక్‌కట్ చేశారు.

పాలకొల్లు అర్బన్: లయన్స్ క్లబ్‌లో పట్టణ సీఐ కె రజనీకుమార్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా 26 మంది అభిమానులు రక్త దానం చేశారు. చిరంజీవి యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రామలింగం పాల్గొన్నారు. పెదమామిడిపల్లిలో గుబ్బల కాసమ్మ అనే దివ్యాంగురాలైన వృద్ధ మహిళకు సంఘ నాయకులు రూ.1116 నగదు, 25 కిలోల బియ్యం, నూతన వస్త్రాలును అందజేసారు.

మొగల్తూరు: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఆయన సొంతూరు మొగల్తూరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాతకాలువ సెంటర్‌లోని చిరంజీవి చిన్ననాటి ఇంటి వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన జన్మదిన కేక్‌ను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామరాజు కట్ చేసి అభిమానులకు పంచారు. అనంతరం చిరంజీవి శాఖా గ్రంథాలయం, మొగల్తూరు ఉన్నత పాఠశాలలోని చిరంజీవి కళావేదిక వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌లను కట్ చేశారు. చిరంజీవి కళావేదిక వద్ద ఆయన బాల్య మిత్రులు పువ్వాడ రాజరాజేశ్వరరావు, కడిమి సాంబమూర్తిలను అభిమానులు సన్మానించారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారం తగదు

ఆకివీడు ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలని కోర్టు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు చర్యలు చేపట్టారని కౌన్సిలర్ జాన్ వెస్లీ తెలిపారు. శుక్రవారం ధర్మాపురంలోని స్థానిక చర్చిలో సంఘ ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. ఇటీవల ధర్మాపురంలో ప్రభుత్వ పోరంబోకు స్థలంలో ఉన్న చర్చిని అన్యాయంగా తొలగించారంటూ సోషల్ మీడియాలో కొందరు దుర్మార్గంగా మాటాడటం తగదన్నారు.

విద్యార్థులు దేశ భక్తిని అలవర్చుకోవాలి



కళ్యాణచక్రవర్తిని సత్కరిస్తున్న చైర్మన్ భోగేశ్వరరావు

పెంటపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తిని అలవర్చుకోవాలని భారత వాయుసేన అధికారి, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న వింగ్ కమాండర్ కళ్యాణ చక్రవర్తి అన్నారు. శుక్రవారం అలంపురం టీబీఆర్ పాఠశాల, జూనియర్ కాలేజ్, డిఫెన్స్ అకాడమిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి సాధన కోసం కృషి చేయాలన్నారు. అనంతరం సంస్థ చైర్మన్ తనుబుద్ధి భోగేశ్వరావు శాలువాతో కళ్యాణ చక్రవర్తిని సత్కరించారు. కార్యక్రమంలో డిఫెన్స్ అకాడమి గ్రూప్ కెప్టెన్ ఆస్కార్‌దాస్, కరస్పాండెంట్ పద్మావతి, సీఈవో రవికిరణ్, ఏవో నాగరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



పాలకొల్లు టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్‌లో భాగంగా స్థానిక ఏఎంసీ ఆవరణలో శుక్రవారం ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ కలుపు నివారణకు మందు పిచికారి చేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని అన్నారు.

ఏఎంసీ ఆవరణలో కలుపు నివారణ మందు పిచాకారీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్

నేటి నుంచి ఒంగోలులో సీపీఐ మహాసభలు

భీమవరం టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో జరిగే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను భీమవరం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆ విష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ 23న వేలాది మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని, 24,25 తేదీ ల్లో జరిగే ప్రతినిధుల సమావేశాల్లో దేశంలోనూ రాష్ట్రంలోనూ పాలకులవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు రూపొందంచడం జరుగుతుందని తెలిపారు.

డీవైఈవోగా రామాంజనేయులు

తాడేపల్లిగూడెం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం డీవైఈవోగా కేవీఎస్ఆర్ రామాంజనేయులు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన నిడదవోలు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పనిచేస్తూ నిడదవోలు మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా తాడేపల్లిగూడెం డీవైఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం ఎంఈవోలు వి.హనుమ, పీఎంకే జ్యోతిలతో పాటు పలువురు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డీవైఈవోను కలిసి అభినందనలు తెలిపారు.

గ్యాస్ పొయ్యి, బండలు వితరణ

ఆకివీడు రూరల్ ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అయి భీమవరంలోని ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలకు దాత కనుమూరు సూర్యనారాయణరాజు గ్యాస్ పొయ్యి, రెండు బండలను అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు పురుషోత్తం విద్యార్థులకు ఐడికార్డులు అందజేశారు. ఎంఈవో రవీంద్ర, మాజీ వైస్ ఎంపీపీ నౌకట్ల రామారావు పాల్గొన్నారు.

పైప్‌లైన్ విస్తరణ పనులు ప్రారంభం

మొగల్తూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శివారు ఇళ్లకు శుద్ధి చేసిన తాగునీరు అందించడమే ధ్యేయమని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. శుక్రవారం శేరేపాలెం గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.17.50లక్షలతో నిర్మించిన మైక్రోఫిల్టర్, మంచినీటి పైప్‌లైన్ విస్తరణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ముగ్గురు వ్యక్తులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.66,786 చెక్కులను అందించారు. ఈ సర్పంచ్ తణుకుల మునేశ్వరరావు పాల్గొన్నారు.

పోషకాహారం కిట్లు పంపిణీ

పాలకొల్లు రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం డాక్టర్ నవ్యజీవన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు అధ్యక్షుడు నిక్షయ మిత్ర డాక్టర్ కోసూరు రామకృష్ణ ఆనందరాజు, క్లబ్ సభ్యులు శుక్రవారం టీబీ మందులు వాడేవారు 20మందికి అదనపు పోషకాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్యజీవన్ మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి టీబీ యూనిట్‌లో పరీక్షలు చేస్తున్నామన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన రోగులకు 6నెలలు పాటు మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో గుబ్బల హరిబాబు, రోటరీ క్లబ్ కార్యదర్శి పోతాబత్తుల సత్యనారాయణ, కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాసరావు గ్రామ టీడీపీ నాయకులు నెక్కంటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీటీ ఇంజక్షన్లు

ఉండి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్‌పి అగ్రహారం పారిశ్రామిక శిక్షణ కేంద్రంలోని 70 మంది విద్యార్థులకు టీటీ ఇంజక్షన్లు ఇచ్చినట్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పీహెచ్ఎన్ హెప్సికుమారి తెలిపారు. టీటీ ఇంజక్షను ముందుగా చేయించుకోవడం వలన ఎన్నో లాభాలున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌వి లక్ష్మీ, ఆశవర్కర్లు జి.శ్యామలా, కె.సువార్త పాల్గొన్నారు.



గోడ పత్రికను అవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

మట్టి వినాయకుడిని పూజిద్దాం

భీమవరం టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పర్యావరణ అనుకూల వినాయక చవితి అవగాహన కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను, కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు మట్టి వినాయకులతో పూజించడం, పత్రిని ఉపయోగించడం ద్వారా కలిగే ప్రయోజనాలపై ఇప్పటికే జిల్లా అంతటా కళాజాతాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పేస్ ఎన్జీవో ప్రెసిడెంట్ గోపిశెట్టి మురళీకృష్ణ పాల్గొన్నారు.

పోలీసు అనుమతి తీసుకోవాలి

గణపవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో చవితి ఉత్సవాలు నిర్వహించేవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని నిడమర్రు సీఐ నక్కా రజనీకుమార్ సూచించారు. గణపవరం కార్యాలయంలో రజనీకుమార్ మాట్లాడుతూ వినాయకచవితి ఏర్పాట్లుకు పలు సూచనలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఏదైన సంఘటన జరిగితే ఆ కమిటీ బాధ్యత తీసుకోవాలని అగ్నిప్రమాదం జరగకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి 10 గంటలు తరువాత ఎటువంటి కార్యక్రమాలు జరపరాదని హుండీలు వంటి విలువైన వస్తువులు పెట్టుకుంటే వాటిపూర్తి బాధ్యత కమిటీ తీసుకోవాలని సూచించారు.

ప్రకృతి సేద్యంతో రైతులకు లాభం



గణపవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని తద్వారా నాణ్యమైన దిగుబడి సాధించాలని కాశీపాడు సర్పంచ్ తెర్లి నాగరాజు అన్నారు. శుక్రవారం కాశీపాడులో 30ఎకరాల వరిపంటకు డ్రోన్ ద్వారా సామూహిక జీవామృతం, కోడిగుడ్డు, నిమ్మరసం ద్రవంతో పిచాకారి చేశారు. ప్రకృతివ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నూకరాజు మాట్లాడుతూ జీవామృతం వలన సూక్షజీవులు ప్రేరణ కలిగి పంటలకు కావల్సిన పోషకాలు అందుతాయన్నారు. చీడపీడల నివారణకు దోహదపడతాయని తెలిపారు.

కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలి

మొగల్తూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొంచుకోవాలని ఆర్డీవో దాసిరాజు సూచించారు. శుక్రవారం కెపిపాలెం ప్లస్‌టూ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రేరీని ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు ఉపయోగపడేలా నాలుగు కంప్యూటర్‌లను అందించిన పూర్వ విద్యార్థి అమెరికాలో నివశిస్తున్న మేళం కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో దాత కుమార్ తండ్రి రంగారావు, సర్పంచ్ కడలి సోంబాబు, ఎస్ఎంసీ చైర్మన్ బొక్కా ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధులకు సత్కారం

పాలకొల్లు టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక యునైటెడ్ కాపు వనితా క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం విశ్వమానవ వేదిక వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పంచె, రుమాలు, మహిళలకు చీరలు పండ్లు, మిఠాయిలు అందజేసి సత్కరించారు. ఈకార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు కావలి మౌని, కె అర్చనా, తోట గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

2న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాక

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 2వ తేదీన జరగనున్న సారథ్యం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి తెలిపారు. స్థానిక మెడికల్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం పట్టణ అధ్యక్షుడు కె కొండ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకులు సమావేశంలో శ్రీదేవి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జిల్లాకు ఈనెల 2వ తేదీన వస్తున్నారని ఆయన పర్యటన విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ పట్టణ కార్యవర్గం: అధ్యక్షుడుగా కొల్లి కొండ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కొణిజేటి గుప్త, బి మల్లిఖార్జునరెడ్డి, పి నాగేశ్వరరావు, పసుపులేటి నందబాబు, నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా సీహెచ్ శ్రీనివాస్, మల్లవోలు సురేష్, చందాని లక్ష్మీనారాయణ, ఐ శేషాద్రి, పి గోపాలకృష్ణంరాజు, శ్యామల గౌరీ, కోశాధికారిగా బైలా శ్రీధర్ ఎన్నికయ్యారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం

నరసాపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల వేములదీవి నల్లిక్రిక్‌లో ప్రమాదశాత్తు మృత్యువాత పడ్డ గణేష్ కుటుంబ సభ్యులకు సూర్యకాలేజీ విద్యార్థులు బాసటగా నిలిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గణేష్ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న విద్యార్థులు తనవంతు సాయంగా రూ.70వేలు విరాళాలు సేకరించారు. వీటిని ప్రభుత్వ విప్ నాయకర్ చేతులమీదుగా గణేష్ తల్లికి అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ, అధ్యాపకులుపాల్గొన్నారు.

రెండవ రోజుకు యోగా పోటీలు



పెంటపాడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అలం పురం సర్వసతి విద్యాలయ్ పాఠశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలు రెండవరోజు శుక్రవారం కూడా కొనసాగాయి. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు వారి యోగాసనాలతో అలరించారు. ఏర్పాట్లను పాఠశాల చైర్మన్ కొలనువాడ వెంకటహనుమ సత్యనారాయణ రాజు పర్యవేక్షించారు.

తడి చెత్తతో ఎరువు తయారీ ఎంతో లాభం

తాడేపల్లిగూడెం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తడిచెత్తను పోగు చేసి ఎరువుగా తయారు చేయడం ద్వారా ఎంతో ప్రయోజనం పొందవచ్చని మునిసిపల్ కమిషనర్ ఎం ఏసుబాబు సూచించారు. 15వ వార్డులో శుక్రవారం ఆన్ సైట్ కంపోస్టింగ్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. తడిచెత్తను పోగుచేసి ఎరువుగా మార్చే విధానంపై మెప్మా, సచివాలయం సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ ఎన్ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ కార్యదర్శులు, మెప్మాసిబ్బంది, వార్డుఇన్‌చార్జులు పాల్గొన్నారు.